క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలకు సత్కారం



ఎం.వి.వి.సత్యనారాయణ, శైలజ దంపతులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుని అంకితభావంతో పనిచేసి సేవా సంస్థలకు తమ వంతు సహకారం అందించాలని రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారావు కోరారు. రోటరీ క్లబ్ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు, పోలియో వ్యాక్సినేషన్‌కు వాగ్దేవి పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సుమారు రూ.60 వేలు సాయం అందించారు. క్లబ్‌కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న వాగ్దేవి స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.శైలజలను గురువారం పాఠశాలలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.రాజు, సంయుక్త కార్యదర్శి కైలాష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ ప్రముఖులకు సంగీత కళాభిషేకం



నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

సీతంపేట: విశాఖ రత్న, దాసరి నారాయణరావు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ ప్రముఖులకు సంగీత కళాభిషేకం నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ, దాసరి నారాయణరావు, ఎన్టీ రామారావు, రామోజీరావు చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. అనంతరం కళారంగ ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఫొటోగ్రాఫర్ మట్టా లోకేష్‌కుమార్, విశ్రాంత సీఎంవో డి.ఎస్.పట్నాయక్, సినీ నటులు బొబ్బాది, కార్మిక నాయకులు పైడి శంకరరావు, అఖిల భారత ఆర్య వైశ్యుల సంఘం అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణలను సత్కరించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మనుపల్ల, మాధురి, శ్రీదేవి, వీరేంద్ర, బి.నాగేశ్వరరావు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పి.ఎ.భాస్కరరావు, అతిథులు కుమార్ నాయక్, నాంచారయ్య, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అధునాతన వైద్యం

సామాన్యులు కోరుకునేది విద్య, వైద్యం. అవి అన్ని వర్గాల ప్రజలకు సరైన రీతిలో అందితే సమాజం పురోగమిస్తుంది. ఈ బృహత్తర కార్యాన్ని తలకెత్తుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక పీహెచ్‌సీ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించింది. దీంతో ప్రజలు పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పొందేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలకు వేలు ఖర్చు చేసి చేయించుకోలేని ఎన్నో పరీక్షలు.. వైద్య సేవలు పీహెచ్‌సీల్లో లభ్యమవుతుండటంతో తమ చెంతనే ఏర్పాటైన పీహెచ్‌సీలపై పేదలు మక్కువ పెంచుకున్నారు.

- పేదలకు చక్కటి సేవలందిస్తున్న కొబ్బరితోట పీహెచ్‌సీ
- చురుగ్గా అడల్ట్ బీసీజీ టీకాలు



అడల్ట్ బీసీజీ టీకా వేయించుకుంటున్న వైద్యుడు ప్రసాదరావు



బంగారుమెట్టలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

అల్లిపురం: కొబ్బరితోట పీహెచ్‌సీ పేదలకు చక్కటి సేవలందిస్తూ స్థానికుల మన్ననలు అందుకుంటోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పీహెచ్‌సీ పని చేస్తోంది. వారం అంతా రోజుకొక స్పెషలిస్ట్ వైద్యుడు ఇక్కడ రోగులకు సేవలందిస్తున్నారు.

60 రకాల పరీక్షలు అందుబాటులోకి..

ప్రస్తుత పరిస్థితుల్లో రక్త పరీక్షలు, షుగర్ టెస్టులు చేయించుకోవాలంటే వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీల ఏర్పాటు.. ఆధునికీకరించిన తర్వాత సుమారు 60 రకాల పరీక్షలు పేదలకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ల్యాబ్‌లకు పరిగెత్తాల్సిన అవసరం లేదురా బాబూ అని పేదలు స్థిమితపడుతున్నారు. కొబ్బరితోట పీహెచ్‌సీలో కూడా రోగులకు అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జోరుగా అడల్ట్ బీసీజీ టీకాలు

కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బీసీజీ టీకాలు వేసే కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. వార్డు సచివాలయాల పరిధిలో 60 సంవత్సరాలు దాటిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు టీబీ వంటి వ్యాధులు రాకుండా నిరోధించేందుకు ముందుగా బీసీజీ టీకాలు వేస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

నిబంధనలు ఇవీ..

షుగర్ ఉన్నవారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, గత 5 ఏళ్లలో టీబీ పేషెంట్ల కుటుంబ సభ్యులు, 18 సంవత్సరాలు పైబడిన వారు, శరీర బరువు 18 కేజీల కన్నా తక్కువ ఉన్న వారు, పొగాకు ఉత్పత్తులు వాడుతున్న వారు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. హృద్రోగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, 18 సంవత్సరాల లోపు వారు, హెచ్‌ఐవీ ఉన్న వారు, గర్భవతులు, డయాలసిస్, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నవారు, మూడు నెలల ముందు బ్లడ్ డొనేట్ చేసిన వారు, జ్వరం వస్తున్న వారు ఈ వాక్సిన్ వేసుకోరాదని సూచించారు.



కొబ్బరితోట పీహెచ్‌సీలో బ్లడ్ టెస్టులు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్నాం



ఆశ వర్కర్‌గా క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్నాం. మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అవసరమైన వారిని పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయిస్తాం. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అడల్ట్ బీసీజీ టీకాలు సచివాలయాల ద్వారా వేస్తున్నాం. ముఖ్యంగా షుగర్ పేషెంట్లు, 60 సంవత్సరాలు దాటిన వారికి ఈ వ్యాక్సిన్ తప్పనిసరి. హృద్రోగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వేయటం లేదు.

– పార్వతి, ఆశ వర్కర్, కొబ్బరితోట పీహెచ్‌సీ

వ్యాక్సిన్ వేసుకోవటం మంచిదే..



అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ పెద్దలకు మంచిదే. షుగర్ వ్యాధిగ్రస్తులకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వారికి టీబీ వంటి వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉంది. అటువంటి వారికి ఈ టీకా ఉపయోగపడుతుందని డాక్టర్లు చెబుతున్నారు. వారి సూచనల మేరకు నేను కూడా వేసుకున్నాను. సచివాలయ సిబ్బంది సేవలు బాగున్నాయి.

– భీశెట్టి హనుమంతరావు, అల్లిపురం

అగర్వాల్ సమ్మేళన్ దక్షిణ భారత కార్యదర్శిగా చాంద్‌మాల్



చాంద్‌మాల్ అగర్వాల్

దాబాగార్డెన్స్: అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ దక్షిణ భారత కార్యదర్శిగా నగరానికి చెందిన చాంద్‌మాల్ అగర్వాల్ నియమితులయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ సర్వసభ్య సమావేశంలో చాంద్‌మాల్ అగర్వాల్‌కు ఈ బాధ్యత అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ అగర్వాల్ సమ్మేళన్ అధ్యక్షుడిగా 2017 నుంచి 2023 వరకు చాంద్‌మాల్ అగర్వాల్ బాధ్యతలు నిర్వహించారు. అగర్వాల్ సమ్మేళన్ బలోపేతానికి విశేష కృషి చేస్తున్న చాంద్‌మాల్‌ను జాతీయ స్థాయి సేవలందించే విధంగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్ష దీవుల్లో ఆయన సంఘ కార్యకలాపాలు విస్తృతపరచనున్నారు. 1975లో ఆవిర్భవించిన అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నియామకం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చాంద్‌మాల్ అగర్వాల్ పేర్కొన్నారు. సమ్మేళన్ జాతీయ అధ్యక్షుడు గోపాల్ శరణ్ గర్గ్, ప్రధాన కార్యదర్శి గోపాల్ గోయల్ సహా జాతీయ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మేళన్ స్వర్ణోత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా ఏడాది పాటు కార్యక్రమాలు చేసేలా సమ్మేళన్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హర్యానాలోని అగ్రహలో నిర్మిస్తున్న లక్ష్మీదేవి ఆలయం మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు సమ్మేళన్ సిద్ధమైందని చాంద్‌మాల్ తెలిపారు.

‘ఆకుపచ్చని జ్ఞాపకం’ పుస్తకావిష్కరణ రేపు

అగనంపూడి: యువ రచయిత వెంకట్ కంచిపాటి రచించిన ‘ఆకుపచ్చని జ్ఞాపకం’ పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం అగనంపూడి సీడబ్ల్యూసీలో చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచిపాటి గురుమూర్తి స్మారక పురస్కారాలు, కథలు, కవితల పోటీల విజేతలకు బహుమతులు కూడా అందించనున్నట్లు వెంకట్ తెలిపారు. కార్యక్రమానికి రచయిత, నటులు చెల్లూరి సాంబమూర్తి, దేవులపల్లి దుర్గా ప్రసాద్, సినీ నటుడు ఐ.ప్రసన్నకుమార్, తెలుగు పండితుడు కొప్పిశెట్టి సూర్యనారాయణ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలియజేశారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: విద్యార్థులు నీటిని పొదుపుగా వాడడంతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని పెదముషిడివాడ హైస్కూల్ హెచ్ఎం కృష్ణ సూచించారు. మిషన్ లైఫ్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నీటి పరిరక్షణ చర్యలపై పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓ పక్క భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని.. మరోపక్క నీరు కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నీటిని కూడా కొనుక్కునే పరిస్థితి ఎదురవుతోందన్నారు. నీటిని వృథాగా పోనివ్వవద్దని, ఇంటి ఆవరణాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ టీచర్ సాయి లక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయులు పెద్దినాయుడు, సుధాకర్, పీడీ రమణ పాల్గొన్నారు.

సామాజిక సేవకురాలు జ్యోతికి అవార్డు ప్రదానం



వీఐపీ సెలబ్రిటీ గెస్ట్ అవార్డు అందుకుంటున్న జ్యోతి కొత్తపల్లి

అల్లిపురం: ప్రముఖ సామాజిక సేవకురాలు జ్యోతి కొత్తపల్లికి వీఐపీ సెలబ్రిటీ గెస్ట్ అవార్డు దక్కింది. తాజాగా ఢిల్లీలోని రాడిసన్ బ్లూ హోటల్లో నిర్వహించిన ఎస్ఆర్పీ ఈవెంట్స్‌లో నటి నిషి సక్సేనాతో కలిసి ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఇప్పటికే జ్యోతి కొత్తపల్లి గ్లోబల్ మిసెస్ ఆంధ్రప్రదేశ్ ఇండియా ఇంటర్నేషనల్ 2023 టైటిల్ గెలుచుకున్నారు. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి యాష్ ఇంటర్నేషనల్ షో కోసం వెళ్తున్నారు. విశాఖ నగరంలో పేదలు, అనాథలకు ఆహారం, మందులు, పుస్తకాలు అందిస్తున్న ఆమె సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత జ్యోతి కొత్తపల్లి మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలనే సేవాగుణం శాశ్వతమన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలన్నారు. ఈ అవార్డు అందుకున్న సందర్భంగా సుమారు 50 మంది పిల్లలకు ఆమె పుస్తకాలు అందజేశారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



ధ్యాన మందిరంలో కంటి పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



అన్నదానంలో పాల్గొన్న భక్తులు, పేదలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్యాన మందిరం ప్రాంగణంలో మ్యాక్స్‌విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది భక్తులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వయసు ప్రభావంతో కళ్లలో ఏర్పడే కాటరాక్ట్, షుగర్, హైపర్‌టెన్షన్ వల్ల రెటీనాలో వచ్చే మార్పులు గురించిన సలహాలు ఆస్పత్రి సిబ్బంది ఇచ్చారు. మధ్యాహ్నం బాబాకు హారతి అనంతరం భక్తులకు, పేదలకు అన్నదానం నిర్వహించారు. రాత్రి బాబా భజనలు, పల్లకీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, భక్తులు, మ్యాక్స్‌విజన్ ఆప్టోమెట్రిస్ట్ సునీత, సిబ్బంది రుషిక, వెంకట్ పాల్గొన్నారు.



స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

చిత్రలేఖనంలో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

గాజువాక: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎకో క్లబ్ మిషన్ ఫర్ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గాజువాక హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. చిత్రలేఖనం, ఉపన్యాసం అంశాల్లో ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు కొనసాగిన పోటీల్లో చిత్రలేఖనం సీనియర్స్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని వై.నీతు అక్షయ, జూనియర్స్ విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని జాహ్నవి ద్వితీయ స్థానాలను సాధించగా, ఉపన్యాస పోటీల జూనియర్స్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని వై.నికిష ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా వారికి డీఈవో చంద్రకళ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, చిత్రలేఖన ఉపాధ్యాయుడు భావనారుషి, కో-ఆర్డినేటర్లు సీహెచ్.కమల, జనార్దన్ తదితరులు అభినందించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి రాజయోగ దోహదం



యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: రాజయోగతోనే సంపూర్ణ మానసిక ఆరోగ్యం సమకూరుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ హెచ్‌బీ కాలనీ శాఖ రాజయోగ ధ్యానం ఉపాధ్యాయురాలు బీకే రమ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటా జూన్ 21న ప్రపంచ దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందని గుర్తు చేశారు. యోగా శాంతికి చిహ్నమన్నారు. మానవులు గర్వించే రీతిన దేశ రాజయోగ వైభవం ఇంకా పెరగాలన్నారు. పూర్వం రుషులు, మునులు రాజయోగను ప్రాచుర్యంలోకి తెచ్చారని, ప్రజలంతా యోగ, రాజయోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ మానసిక ఆరోగ్యం పొందాలన్నారు. ప్రపంచంలో గల 140 దేశాల్లో 9,200కు పైగా ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉచిత రాజ యోగ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నగరంలోని హెచ్‌బీ కాలనీ, వన్‌టౌన్ బురుజుపేట, ఎంవీపీ కాలనీ సెక్టార్-1 నేతాజీ పార్క్, మహారాణిపేట అఫీషియల్ కాలనీ, శాంతిపురం, రైల్వే న్యూకాలనీ వినాయక గుడి, గాజువాక బీసీ రోడ్డు, అగనంపూడి, మల్కాపురం అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో గల బ్రహ్మకుమారీస్ శాఖల్లో ఉచిత రాజయోగ శిక్షణ ఇస్తున్నామని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రమ తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఆదారి కొండలరావు, చిట్టిబాబును సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు నాగరాజు పట్నాయక్, బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమాసహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇనుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 22న పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు వేకువ జాము 2 నుంచి 4 గంటల వరకు నిత్యారాధన, బాలభోగం, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక వ్రతాలు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్న సమారాధన, మధ్యాహ్నం 1 గంటకు పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, చక్రస్నానం, అవభృదం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

దివ్య వార్షికోత్సవంలో భాగంగా..

ఇనుకకొండ సత్యనారాయణ స్వామి దివ్య వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైదికులచే సుదర్శన హోమం, వైదిక సదస్యంలో భాగంగా 25 మంది పండితులకు సత్కారం నిర్వహించారు. అనంతరం మహాదాశీర్వచనం వైభవంగా జరిపారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. శిరీష పాల్గొన్నారు.

నేడు దోపోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దోపోత్సవం (తిరుమంగైయ్యాళ్వార్ కై ంకర్యం) నిర్వహించనున్నట్టు ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. 22న జేష్ఠ పౌర్ణమి, 23న శ్రీపుష్పయాగం, అనంతరం పవళింపు సేవతో కల్యాణ వేడుకలు ముగుస్తాయని చెప్పారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



లంబికాబాగ్ ఆలయంలో వేంచేసిన సీతారామచంద్రస్వామి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవభృదోత్సవం, చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి తెప్పోత్సవ(ప్లవోత్సవం) కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోర్టు సహాయ సహకారాలతో శ్రీదేవి భూదేవి సమేతుడైన స్వామికి మేళ తాళాలతో పైలట్ లాంచీలో అతి వైభవంగా తెప్పోత్సవం జరిపించనున్నారు.

ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆవరణలో గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, స్వస్తి పుణ్యాహవచనం, అంకురార్పణ, పరిషత్తు, నవగ్రహ సహిత సర్వదేవతా మండపారాధన, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా నవ గ్రహ మండపారాధన, మృత్యుంజయ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి కల్యాణం..

శుక్రవారం సాయంత్రం శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. కల్యాణం చేయించుకునే భక్తులు ముందుగా తమ పేర్లు ఆలయంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి దేవాలయ వార్షికోత్సవం



రాఘవేంద్ర స్వామికి హారతులు ఇస్తున్న అర్చక స్వాములు



ప్రసన్న తీర్థుల వారిని సత్కరిస్తున్న సింహాచలం సూపరింటెండెంట్ శ్రీనివాస్, రుత్వికులు

అల్లిపురం: రామ్‌నగర్‌లో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయ 46వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి అయోధ్య నుంచి శ్రీ పేజావర మఠాధిపతులు, బాల రాముని సేవించిన స్వాములు, ప్రసన్న తీర్థులు విచ్చేసారు. వార్షికోత్సవం సందర్భంగా అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. విశ్వ ప్రసన్న తీర్థస్వామీజీకి 60 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా షష్టిపూర్తి, తులాభార సేవ, పాదపూజలు చేపట్టారు. అనంతరం ప్రసన్న తీర్థ స్వామిని సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చనలు, హారతులు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.